క్లుప్తంగా

నేడు 'వలంటీర్లకు వందనం'

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో వలంటీర్ల వందనం కార్యక్రమం సోమవారం ఉదయం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. వలంటీర్లకు సేవా వజ్రా, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు అందజేస్తామని చెప్పారు. అదే విధంగా అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా రిజిస్ట్రేషన్ చేసిన పట్టాలను అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి మాజీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గొకిన సునేత్ర దేవిలు హాజరవుతారని తెలిపారు.

పనికి తగ్గ వేతనం అందించాలి



మహిళా దినోత్సవ సభలో ప్రసంగిస్తున్న వీరలక్ష్మి

పెద్దాపురం: శ్రామిక మహిళలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఐద్వా జిల్లా కార్యదర్శి వరలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి ఎస్తేరు రాణి అన్నారు. ఆదివారం దివిలి గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు దాడి బేబీ అధ్యక్షతన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పనిచేస్తున్న పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలపై అత్యాచారాలు నిరోధించాలని డిమాండ్ చేశారు. ఆశ వర్కర్స్ యూనియన్ నాగరత్నం, భవానీ, అంగన్‌వాడీ వర్కర్లు నూకరత్నం, మణికంఠ, లలిత, సూర్యకుమారి, చక్రవేణి, కృష్ణవేణి, నాగకుమారి, సీత, డి.క్రాంతికుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం

కొత్తపల్లి: మండంలోని కొమరగిరి శివారు ఆనందనగర్, నాగంపేటలో ఆదివారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి లక్ష్మీదేవి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతరించిపోతున్న కళలను బతికించాలి



తోలుబొమ్మలాట శిక్షణకు ఎంపికైన చిన్నారులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

బోట్‌క్లబ్: అంతరించిపోతున్న కళలను బతికించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. స్థానిక సత్కళావాహినిలో ఆదివారం తోలుబొమ్మలాట కళాకారులకు శిక్షణ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన చిన్నతనంలో టీవీలు ఉండేవి కాదని, అప్పట్లో తోలుబొమ్మలాటకు ఎంతో ఆదరణ ఉండేదన్నారు. గ్రామాల్లో ప్రదర్శన వేస్తే అందరూ వచ్చి తిలకించేవారన్నారు. ఈ కళను బతికించేందుకు కేంద్ర ప్రభుత్వం శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వ నాటక అకాడమీ సభ్యురాలు ఎస్పీ భారతి మాట్లాడుతూ మన సంస్కృతికి నిదర్శనం కళలు అని అన్నారు. మన దేశంలో 64 కళలు ఉన్నాయన్నారు. ప్రతి ఒక్కరూ ఏదొక కళను నేర్చుకోవాలన్నారు. జీవితంలో చదువు ఒక్కటే కాకుండా వారికి ఇష్టమైన కళను ఎంచుకుని రాణిస్తే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న సత్కళావాహిని తాము అడిగిన వెంటనే ఇక్కడ శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఒప్పుకున్న కృష్ణమాచార్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం తోలుబొమ్మలాట శిక్షణకు అర్హత సాధించిన చిన్నారులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సత్కరించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 వరకూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. నగర ప్రజలు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884 2357800కు కాల్ చేసి తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10.30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందన్నారు. డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ రాలేని ప్రజలు స్థానికంగా ఉండే సచివాలయాల్లో కూడా సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

పురస్కారాల ప్రదానం

కాకినాడ సిటీ: స్థానిక ఖిద్మత్ కమిటీ ఆత్మీయ సమావేశం వంద మందితో హబీబీయా షాదీఖానాలో కమిటీ అధ్యక్షుడు షేక్ చిస్తి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న కొందరిని గుర్తించి ఖిద్మత్ గార్ పురస్కారంతో సత్కరించారు. కార్యదర్శి హుస్సేన్, కోశాధికారి గౌస్, ఉపాధ్యక్షుడు అలీం పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించడానికి సిద్ధం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దొరబాబు
- జగనన్న కాలనీ నుంచి ప్రచారం ప్రారంభం

సామర్లకోట: రాష్ట్రంలో మరోసారి చరిత్ర సృష్టించడానికి వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందని పెద్దాపురం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రత్తిపాడు రోడ్డులోని జగనన్న కాలనీ నుంచి దొరబాబు తన విజయ సంకల్ప యాత్రతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ నుంచి పోటీ చేసే అవకాశాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తనకు కల్పించారని, ఈ మేరకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 40 ఏళ్ల నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం వివిధ పార్టీల నుంచి ప్రయత్నం చేశానని, నేటికి ఆ కల నెరవేరిందన్నారు. తనను ప్రజలు ఆశీర్వదించాలన్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తామని చెప్పారు. స్థానికేతరులకు నియోజకవర్గ సమస్యలపై అవగాహన లేకపోవడంతో ఇక్కడి అభివృద్ధి మందగించిందని



సామర్లకోట జగనన్న కాలనీ వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న దొరబాబు తదితరులు



సామర్లకోటలో విజయ సంకల్ప యాత్ర చేస్తున్న దొరబాబు

అన్నారు. స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. హామీలకే పరిమితమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేస్తానని చెప్పారు.

ఇచ్చిన హామీలన్నీ అమలు

గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని దొరబాబు అన్నారు. జగన్‌ను ఓడించలేమని తెలిసిన చంద్రబాబు జనసేన, బీజేపీలతో జత కట్టారన్నారు. ఎంతమంది కలసి వచ్చినా వైఎస్సార్ సీపీకి విజయం సాధించే సత్తా ఉందన్నారు. తన విజయం సంకల్ప యాత్ర ప్రారంభానికి వచ్చిన జనాన్ని చూస్తే అప్పుడే ఎన్నికల్లో విజయం సాధించినంత ఆనందంగా ఉందని చెప్పారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పాదయాత్ర పూర్తి చేసి తదుపరి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తానన్నారు. రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ చైర్ పర్సన్ ఆవాల రాజేశ్వరీ, క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మడికి సోనియా మేరీ, మున్సిపల్ చైర్ పర్సన్లు గంగిరెడ్డి అరుణ, బొడ్డు తులసీ మంగతాయారు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, ఎలిశెట్టి నరేష్, జిల్లా కార్యదర్శి తలారి దొరబాబు, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ పాగా సురేష్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి

పెద్దాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టాలని అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ అన్నారు. మేం సిద్ధం మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక 16వ వార్డుల్లో ఓటర్లను కలసి ఎన్నికల ప్రచారం చేశారు. ప్రజాకర్షక పథకాలతో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలంటే పుర ప్రజలంతా వైఎస్సార్ సీపీకి ఓటు వెయ్యాలన్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న దవులూరి దొరబాబు, కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న చలమలశెట్టి సునీల్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వార్డుల్లో ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం సంక్షేమాన్ని వివరిస్తూ మేం సిద్ధం, మా బూత్ సిద్ధం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బషీర్, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలపై ప్రజలకు వివరిస్తున్న జానీ

మొండి పన్నుల వసూళ్లపై దృష్టి

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని మొండి పన్నుల బకాయిలపై అధికారులు దృష్టిసారించారు. ఈ మేరకు ఆదివారం బకాయిదారులను మున్సిపల్ కమిషనర్ జె.రామారావు కలిశారు. పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. స్థానిక స్టేషన్ సెంటర్‌లోని పెట్రోల్ బంకు నుంచి రూ. ఏడు లక్షల వరకూ పన్ను బకాయి ఉండటంతో నిర్వాహకులను కలసి మార్చి లోపు బకాయిలను చెల్లించాలన్నారు. స్టేషన్ సెంటర్‌లో ఉన్న ఫంక్షన్ హాల్స్, లాడ్జిలు, హోటల్స్‌లో బకాయిలపై యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. అదే విధంగా ఆయా హోటల్స్‌లో ఆహార పదార్థాలను కమిషనర్ పరిశీలించారు. మార్చి నెలా ఖర్చు నాటికి 100 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉందని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి ప్రసాదరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సురేంద్రకుమార్, బిల్లు కలెక్టర్ నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

- ఇంటి పన్నులు, ఖాళీ స్థలం, కుళాయి పన్నుల వసూలుపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ రామారావు అన్నారు. స్థానికంగా కమిషనర్ చాంబర్‌లో బిల్లు కలెక్టర్లు, సచివాలయ అడ్మిన్లతో ఆయన సమీక్షించారు. పన్నుల బకాయి ఉన్నవారు ఈనెల 31వ తేదీ లోపు ఒకేసారి చెల్లించడం ద్వారా వడ్డీ రాయితీ పొందవచ్చని చెప్పారు. ఎన్నికల్లో పోటీ చేసేవారు పన్నుల బకాయిలు లేకుండా చూసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఇంటింటా వివరించాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని చెత్తను డ్రైనులో వేయకుండా చూడాలన్నారు.



సామర్లకోటలో ఫంక్షన్ హాలును పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు తదితరులు

వైభవంగా త్రిశూల స్నానం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి ఆలయ పుష్కరణిలో ఆదివారం త్రిశూల స్నానం జరిగింది. బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాల్లో భాగంగా బుధవారం దీక్షాధారణ చేసిన శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి దంపతులకు ఆలయ కోనేరులో ముందుగా ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అల్లక్కి రాజ్‌గోపాల్‌లు త్రిశూల స్నానం చేయించారు. తదుపరి ఉత్సవ కమిటీ సభ్యుడు బీవీ రమణ, భక్త సంఘం నాయకుడు బిక్కిన సాయిలకు, భక్తులకు పుష్కరణిలో ఆలయ పండితులు త్రిశూల స్నానాలు చేయించారు. ఆలయ కోనేరులో త్రిశూల స్నానం చేయడానికి భక్తులు పోటీ పడ్డారు. అంతకు ముందు ఆలయంలో హోమం జరిగింది. భక్త సంఘ నాయకులు తలుపుల అంజనీకుమార్, బీవీ రమణ, చల్లా సత్తిబాబులు భక్తులకు సేవలందించారు. త్రిశూల స్నానం అనంతరం స్వామి, అమ్మవార్లకు తీర్థపు సేవ జరిగింది. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షాపుల వద్దకు స్వామివారిని అమ్మవార్లను పల్లకిలో తీసుకువచ్చి వారికి దర్శనం కల్పించారు. షాపుల యజమానులు వారు విక్రయాలు చేసుకునే వస్తువులను స్వామీ అమ్మవార్లకు సమర్పించారు. రామభీమేశ్వర స్వామి ఆలయానికి రాత్రి వరకూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈఓ భళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి స్వామివారికి శ్రీపుష్పయాగం జరుగనుంది.



పంచారామ క్షేత్ర కోనేరులో భక్తుల త్రిశూల స్నానం

సమన్వయంతో ఉత్సవాలు విజయవంతం

సామర్లకోట: స్థానిక బాలాత్రిపుర సుందరి సమేత కుమారరామ భీమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణం, మహా శివరాత్రి ఉత్సవాలు, రథోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు, వివిధ రాజకీయ పార్టీల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తాను మొదటి సారిగా ఉత్సవాలు నిర్వహించినా అందరూ పూర్తి స్థాయిలో సహకరించారన్నారు. పోలీసు సిబ్బంది, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చూశారన్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దాతలు తాగునీరు, పాలు, మజ్జిగ, అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాతలందరినీ ఒకసారి కలసి అభినందనలు తెలియజేస్తానని తెలిపారు. సోమవారం రాత్రి స్వామివారి శ్రీపుష్పయోగోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని, భక్తులు ఆ కార్యక్రమంలోను పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలన్నారు. ప్రాంగణంలో ఆలయ నిర్మాణ సమయంలో వేసిన రాళ్లు తీసి లెవలింగ్ చేసే పనులు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. ఆలయ ప్రాంగణంలో రాళ్లు ఎత్తుపల్లాలుగా ఉండటంతో భక్తులు ఇబ్బంది పడటంతో గతంలోనే నిధులు మంజూరైనట్లు తెలిపారు. దీనికి సంబంధించి పురావస్తు శాఖ అధికారులు పనులు చేస్తారన్నారు.



భళ్ల నీలకంఠం, ఈఓ, పంచారామ క్షేత్రం

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- కామన్నగారిపాకలులో గడప గడపకూ మన ప్రభుత్వం

కొత్తపల్లి: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. మండలంలోని కొమరగిరి శివారు కామన్నగారిపాకలు, నాగంపేటలో ఆదివారం ఆమె గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. డ్రైన్లు, తాగునీరు, ఇళ్ల స్థలాలు తదితర సమస్యలను స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసి ప్రజలకు పాలనను చేరువ చేశారన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షలు గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు కేటాయించామన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత ప్రభుత్వాలు మహిళలను ఓటు బ్యాంకుగానే చూశాయన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నింటా మహిళలకే అగ్రతాంబూలం ఇచ్చారన్నారు. పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కు 175 స్థానాలు గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ, మాజీ ఎంపీటీసీ కందేపల్లి నూకరాజు, వైఎస్సార్ సీపీ నేతలు గుళ్లపల్లి సత్యనారాయణ, నరుకుర్తి వెంకటలక్ష్మి, కతారి చంటిబాబు, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన అధ్యక్షుడు కొప్పన శివనాథ్, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ బత్తిన సాయి తదితరులు పాల్గొన్నారు.



కామన్నగారిపాకలులో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎంపీ వంగా గీత

వైఎస్సార్ సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్‌కుమార్



పాగా సురేష్‌కుమార్

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్‌ను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ దవులూరి దొరబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ని దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, పలువురు కౌన్సిలర్లు అభినందించారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ స్థానికుడైన దొరబాబును గెలిపించుకోవడానికి అహర్నిశలూ కృషి చేస్తానన్నారు.

'తోటలో కళాశాల' పుస్తకావిష్కరణ

బాలాజీచెరువు: స్థానిక పీఆర్ డిగ్రీ కళాశాల ఇంగ్లిష్ విభాగాధిపతిగా విధులు నిర్వహించిన డాక్టర్ ముళ్లపూడి శ్రీనివాసప్రసాద్ రచించిన 'తోటలో కళాశాల' పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం పీఆర్ డిగ్రీ కళాశాలలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అడిషనల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ హాజరై పుస్తక ఆవిష్కరణ చేశారు. విద్య ప్రాధాన్యాన్ని వివరిస్తూ సమకాలీన అంశాలు ప్రస్తావిస్తూ రచించిన ఈ పుస్తకం నేటికాలం యువత చదవాలన్నారు. కార్యక్రమంలో పైడా వెంకటేశ్వరరావు, పూర్వపు ప్రిన్సిపాల్ భరతలక్ష్మి, వలవల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కవోని నిర్లక్ష్యం

- భవనాలు, బ్రిడ్జిలపై పిచ్చిమొక్కలు
- కట్టడాలు శిథిలమయ్యే ప్రమాదం

సామర్లకోట: ప్రభుత్వ కట్టడాలు ఎంత అవసరమో.. వాటిని కాపాడుకోవడం అంతే అవశ్యం.. అలాంటి సర్కారు భవనాలు, ప్రజాపయోగ కట్టడాలపై నిర్లక్ష్యం అలముకుంటోంది.. ఆయా కట్టడాలపై మొక్కలు పెరిగి శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులు శ్రద్ధ చూపాల్సి ఉంది. సామర్లకోట తహసీల్దార్ కార్యాలయ భవనంపై పిచ్చిమొక్కలు పెరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు. అదేవిధంగా పంచారామ క్షేత్రానికి చెందిన రథం షెడ్డు పైభాగంలో మొక్కలు పెరిగిపోయాయి. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గోడల నుంచి రావి మొక్కలు పెరుగుతున్నాయి. ఇవి మరింత పెరిగితే కట్టడం మనుగడకే ప్రమాదం పొంచి ఉంది. ఈ బ్రిడ్జి నిర్మించి సుమారు 45 ఏళ్లు కావడంతో రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. ఈ బ్రిడ్జి మీదుగా రోజూ 60 నుంచి 100 టన్నుల వరకూ బరువు కలిగిన గ్రానైట్ రాళ్లతో, వివిధ పరిశ్రమలకు యంత్రాలతో వాహనాలు వెళ్తుంటాయి. ఇటువంటి ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడలో రావి మొక్కలు పెరిగిపోయాయి. వీటివల్ల బ్రిడ్జి కట్టడం బీటలు వారి శిథిలయమయ్యే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు బ్రిడ్జి గోడలో మొక్కలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జితో పాటు పంచారామ క్షేత్ర రథం షెడ్డు, తహసీల్దార్ కార్యాలయాలపై మొక్కలు తొలగించాలని సామర్లకోట ఉత్సవ కమిటీ సభ్యుడు చల్లా సత్తిబాబు విజ్ఞప్తి చేశారు. రథం షెడ్డుపై మొక్కల విషయాన్ని ఆలయ ఈఓ నీలకంఠంను దృష్టికి తీసుకురాగా, తాను బాధ్యతలు స్వీకరించి కేవలం పది రోజులే అయ్యిందన్నారు. షెడ్డుపై మొక్కలను తొలగించి రంగులు వేయిస్తామని తెలిపారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పెరిగిన మొక్కలను ఆర్అండ్‌బీ అధికారులు తొలగించాలని, అయితే తాము బాధ్యత తీసుకుని తొలగించే ఏర్పాట్లు చేస్తామని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు.



తహసీల్దార్ కార్యాలయంపై పెరుగుతున్న మొక్కలు





సామర్లకోట ఫ్లైఓవర్ బ్రిడ్జి గోడల్లో పెరిగిన మొక్కలు

ప్రజలందరికీ రక్షిత తాగునీరు

- కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత
- గ్రామాల్లో రూ.1.26 కోట్లతో జల్‌జీవన్ మిషన్ పనులకు శ్రీకారం

కొత్తపల్లి: ప్రజలందరికీ రక్షిత తాగునీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇంచార్జి వంగా గీత అన్నారు. మండలంలోని కొమరగిరి శివారు కామన్నగారిపాకలు, నాగంపేట, వెంకటరాయపురం, చిన్న కలవలదొడ్డి, శొంఠివారిపాకలు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.1.26 కోట్లతో నిర్మించే తాగునీటి ట్యాంకులు, పైపులైన్ పనులకు ఆదివారం ఆమె శంకుస్థాపనలు చేశారు. ఆనంద్ నగర్‌లో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించే కమ్యూనిటీ హాలుకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. మీకు మంచి చేస్తేనే ఓటు వేయండి అని అడిగే దమ్ము రాష్ట్రంలో సీఎం జగన్‌కు తప్ప మరెవ్వరికీ లేదన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ, మాజీ ఎంపీటీసీ కందేపల్లి నూకరాజు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.



నాగంపేటలో జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేసిన ఎంపీ వంగా గీత

ఇంటింటికీ జగనన్న లేఖల పంపిణీ



కొండెవరంలో లబ్ధిదారుకు లేఖ అందజేస్తున్న వలంటీర్



గొల్లప్రోలులో లబ్ధిదారుకు జగనన్న లేఖ అందజేస్తున్న వలంటీర్

పిఠాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక ప్రజలకు వివిధ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వలంటీర్లు వివరిస్తున్నారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో ఆదివారం పలువురు వలంటీర్లు ఇంటింటికీ తిరిగి జగనన్న లేఖలను లబ్ధిదారులకు అందజేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో అన్ని గ్రామాల్లోనూ జగనన్న లేఖలు పంపిణీ జోరుగా సాగుతోంది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలతో కూడిన లేఖలను ప్రజలకు అందజేసి సంక్షేమ పథకాల రూపంలో పొందిన లబ్ధిని వివరిస్తున్నారు.

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో గ్రామ వలంటీర్లు ఆదివారం ఇంటింటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సందేశంతో కూడిన లేఖలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పథకాల రూపంలో చేకూరిన లబ్ధిని వివరించారు.

వైభవంగా రాజశేఖరస్వామి రథోత్సవం

కొత్తపల్లి: స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రాజశేఖరస్వామివారి రతోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఉదయం పండితులు స్వామివారికి అభిషేకాలు, నిత్య హోమం, ప్రత్యేక పూజలు, బలిహరణ నిర్వహించారు. సాయంత్రం రథంపై స్వామివారిని ఉప్పాడ–పిఠాపురం రోడ్డులో ఊరేగించారు. బ్యాండ్ మేళాలు, కోలాట ప్రదర్శనలు బాణసంచా కాల్పుల నడుమ స్వామివారి రథోత్సవం సాగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



రాజశేఖరస్వామి రథోత్సవంలో భక్తులు